www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 14 ఏప్రిల్ 2023

5

ఏలూరు



జీలుగుమిల్లిలో ముగ్గురికి కరోనా



ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో ముగ్గురికి కరోనా సోకినట్లు నిర్ధారణైందని వైద్యాధికారి గాయత్రి తెలిపారు. బుధవారం నలుగురికి ర్యాపిడ్ పరీక్షలు చేయగా మూడు పాజిటివ్‌గా నమోదు కావడంతో మండలంలో గురువారం 15 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. దర్భగూడెంలో ఆరు, జీలుగుమిల్లిలో తొమ్మిది మందికి పరీక్షలు నిర్వహించి శాంపిళ్లు ఏలూరు పంపామన్నారు.

సమస్యలు పరిష్కరించండి

డిఆర్‌సి సమావేశంలో గళమెత్తిన ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు

కొల్లేరులో తాగునీటి చెరువు తవ్వకాలు చేపట్టాలి

ఇళ్ల నిర్మాణం, వ్యవసాయం, తాగునీరు, నాడు-నేడు, ఆరోగ్య సమస్యలు ఏకరువు

రబీ ధాన్యం కొనుగోలులో సమస్యలు లేకుండా చర్యలకు డిమాండ్

తాగునీటి సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు: ఇన్‌ఛార్జి మంత్రి పి.విశ్వరూప్

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి పి.విశ్వరూప్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో తాగునీటి చెరువులకు అనుబంధంగా మరో తాగునీటి చెరువు తవ్వకునేందుకు అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించి కొల్లేరులో తాగునీటి చెరువులు తవ్వకునేందుకు చర్యలు తీసుకోవాలని కొల్లేరును ఆనుకుని ఉన్న కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు ఎంఎల్‌ఎలు కోరారు. గురువారం డిఆర్‌సి సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన కలెక్టరేట్ ప్రాంగణంలోని గోదావరి సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి ఏలూరు జిల్లాలోని ఎంఎల్‌ఎలు ఆళ్ల నాని, అబ్బాయిచౌదరి, పుప్పాల వాసుబాబు, ఎలిజా, తెల్లం బాలరాజు, దూలం నాగేశ్వరరావు, మేకా ప్రతాప్‌అప్పారావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు, అధికారులు హాజరయ్యారు. తొలుత గడిచిన నవంబర్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై తీసుకున్న చర్యలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. పేదలందరికీ ఇళ్లు, ఉపాధిహామీ, నాడు-నేడు, గ్రామీణ నీటిపారుదల, వ్యవసాయం అనుబంధ రంగాలు, ఆరోగ్యం, గడపగడపకు ప్రభుత్వం వంటి ఎనిమిది అంశాలను అజెండాగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో అనేక లేఅవుట్లలో పూడిక చేయలేదన్నారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించలేదని తెలిపారు. అనేక లేఅవుట్లకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్ని లేఅవుట్లు ఇళ్లు కట్టుకోవడానికి యోగ్యంగా లేవని, భూసేకరణ చేసి ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 46 లేఅవుట్లలో ఇళ్లు కట్టే పరిస్థితి లేదన్నారు. పూడిక చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదని తెలిపారు. ఉపాధి హామీలో చేస్తున్న జలకళ అత్యంత దారుణంగా మారిందని, బిల్లులు రావడం లేదన్నారు. సచివాలయ, విలేజీ క్లినిక్‌లు, రైతుభరోసా కేంద్రాల భవనాలు నిర్మించిన వారికి సొమ్ము రావడం లేదని, ప్రభుత్వం నుంచి ఇచ్చే సిమెంట్ సరిగా అందడం లేదని తెలిపారు. కొల్లేరు గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీరు లేదని ఎంఎల్‌ఎలు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. హ్యాండ్ బోర్లు రిపేరు చేయాలని కోరారు. రబీలో నూరుశాతం ధాన్యం కొనుగోలు చేయాలని, సంచులు, లారీల సమస్య లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు మెడికల్ కాలేజీలో వైద్యం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.విశ్వరూప్

ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. గురువారం ఏలూరులో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం అనంతరం మంత్రి విశ్వరూప్ సమావేశ వివరాలను మీడియాకు వెల్లడించారు. నీటిఎద్దడి తలెత్తకుండా ఏలూరు జిల్లాలో రూ.63.14 లక్షలతో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన అంశాలను ఆయా నియోజకవర్గాల వారీగా సమీక్షించామన్నారు. ముఖ్యంగా కొల్లేరు పరిధిలోని కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో కొల్లేరు పరిధిలో ఏవిధమైన కాల్వలు లేనందున ఆ ప్రాంతంలో ఉన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకొని తాగునీటి చెరువుల తవ్వకం విషయంపై ఇప్పటికే సంబంధిత ఎంఎల్‌ఎ, జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ ప్రాంతంలో తాగునీటి చెరువుల ఏర్పాటు కోసం ప్రత్యేక అనుమతుల కోసం సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. ప్రయివేటు వ్యక్తులకు అప్పగించకుండా తహశీల్దారు, ఆర్‌డిఒ పర్యవేక్షణలో తాగునీటి చెరువులు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. తాగునీటి చెరువులు నింపేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఒహెచ్ఎస్ఆర్‌లను పూర్తిస్థాయిలో నీటితో నింపి ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. రబీ ధాన్యం కొనుగోలు విషయంపై గత ఖరీఫ్‌లో గుర్తించిన సమస్యలను అధిగమించి గోనె సంచుల సరఫరా, లారీల రవాణా తదితర అంశాలపై స్పష్టమైన చర్యలు తీసుకునేలా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. జిల్లాకు నిర్దేశించిన ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేయడంతోపాటు ఇంకా ఎంత ధాన్యం ఉన్నా కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల అకాల వర్షాల మూలంగా పోలవరం తదితర నియోజకవర్గాల్లో పొగాకు, మొక్కజొన్న దెబ్బతిన్నాయని, ఆయా పంటలకు సంబంధించి ఎన్యుమరేషన్ చేశారని చెప్పారు. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే తక్షణమే వారికి పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు వీలుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోవిడ్ వ్యాప్తికి సంబంధించి ఇప్పటికే కేంద్రప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసిందని, దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఒ కోవిడ్ పరీక్షలకు సంబంధించి కిట్లను అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో సిద్ధంగా ఉంచారన్నారు. మొదటి, రెండో వేవ్‌లో తలెత్తిన తీవ్రమైన పరిణామాలు ఇప్పుడు సంభవించవని, అయినప్పటికీ ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుందని తెలిపారు. ఏలూరు జిజిహెచ్ వైద్య కళాశాలగా అనుబంధంగా రూపాంతరం చెందిన దృష్ట్యా తొలిదశలో కొన్ని సమస్యలు ఎదురౌతున్నాయని, వాటిని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలో మెడికల్ కౌన్సిల్ బృందం దీన్ని పరిశీలించేందుకు రానుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని విశ్వరూప్ స్పష్టం చేశారు. సమావేశంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమన్న సూరీడు

కన్పించని చలివేంద్రాలు - వేళాపాళాలేని విద్యుత్ కోతలు

ఎండ తీవ్రతతో ప్రయాణికులు రాక నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

సూర్య ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. గతవారం రోజులుగా ఎండలు మండుతుండటంతో జనం అల్లాడుతున్నారు. భానుడి భగభగలతో గ్రామీణ ప్రాంత ప్రజానీకం హడలెత్తుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వివిధ పనులపై బయటకు వస్తే తిరిగి ఇంటికెళ్లేసరికి ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతతో రోగులు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడు భగభగమంటూ ప్రతాపం చూపడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్నాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉంది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లకే పరిమితమౌతున్నారు.

కనిపించని చలివేంద్రాలు

ప్రతియేటా ఏప్రిల్‌లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, పంచాయతీ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు పంచాయతీలు ఏర్పాటు చేసేవి. దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. మండలంలోని గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలోగాని, దాతల సహకారంతోగాని ఎక్కడా చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో అత్యవసర పనులపై బయటకు వచ్చే బాటసారులు, ప్రజలు, వాహనదారులు దాహార్తితో అలమటిస్తున్నారు. దీంతో చేసేదిలేక ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు శీతాలపానీయాలను ఆశ్రయిస్తున్నారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

వేసవి తాపానికి తోడు వేళపాళాలేని విద్యుత్ కోతలతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి తాపానికి తోడు అనధికార విద్యుత్ కోతలు విధించడంతో జనం నానావస్థలు పడుతున్నారు.

తగ్గిన ప్రయాణాలు

వేసవి తాపానికి ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. ముఖ్యమైన పనులైతే తప్ప ప్రయాణాలు చేయడం లేదు. ఒకవేళ ప్రయాణం చేయాల్సి వస్తే ఉదయం తొమ్మిది గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాతే చేస్తున్నారు. అత్యవరమైతే టోపీలు, కళ్లజోళ్లు ధరించి రాకపోకలు సాగిస్తున్నారు.

పోలవరం కాంటూరు లెక్కలు శాస్త్రీయంగా లేవు

డిఆర్‌సి సమావేశంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 36 మీటర్ల నీటిమట్టానికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 90 శాతానికిపైగా గ్రామాలు మునిగిపోయాయని, దీన్నిబట్టి కాంటూరు లెక్కలు శాస్త్రీయంగా లేవని స్పష్టమవుతుందని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. గురువారం ఏలూరు డిఆర్‌సి (జిల్లా సమీక్షా కమిటీ సమావేశం) జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతూ ముంపునకు గురైన గ్రామాలన్నింటికీ 41.15 కాంటూరుకు పరిధిలో చేర్చి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించాలన్నారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణ పథకానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్షా 80 వేలు ఏమాత్రం సరిపోవడం లేదని, రూ.ఐదు లక్షలు ఇస్తే బాగుంటుందని తెలిపారు. దెందులూరు మండలం దోసపాడులో అన్యాక్రాంతమైన దళితుల సీలింగ్, అసైన్డ్ భూములను నిరుపేద కుటుంబాలకు చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు బకాయిలను చెల్లించాలని, తక్షణమే పనులు కల్పించాలని, వేతనాలకు సంబంధించిన పేస్లిప్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేయడంతోపాటు, భూములు కోల్పోయిన రైతులకు, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలన్నారు. 33 శాతం దెబ్బతింటేనే పంట నష్టం నమోదు చేస్తున్నారని అలాకాకుండా ఎంతమేర దెబ్బతింటే అంతవరకూ నమోదు చేసేలా నిబంధనలను మార్పుచేయాలన్నారు. ఖరీఫ్‌లో మాదిరిగా కాకుండా రబీలో పండిన పంటను నూరుశాతం కొనుగోలు చేసేలా చూడాలన్నారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలకు స్థలం కేటాయించి, ఎంపీ నిధులు మంజూరు చేసి శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. ఏలూరు కార్పొరేషన్‌లో ఉన్న ఉర్దూ ఉన్నతపాఠశాలలో ఉర్దూ పండిట్ పోస్టును మంజూరు చేయాలన్నారు. జిల్లాలో అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములను కేంద్రచట్టాలను అనుసరించి స్వాధీనం చేసుకునే చర్యలను చేపట్టాలన్నారు. బుట్టాయగూడెం మండలంలో ఎస్‌సి మహిళను వివాహం చేసుకుంటానని గర్భవతిని చేసి మోసగించిన నిందితుడిపై వెంటనే కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. పూర్వపశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని వివేకానంద ఎయిడెడ్ పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు కె.సుగుణకుమారిని ఉద్యోగ విరమణ వయస్సును ప్రభుత్వం పెంచినందున తిరిగి విధుల్లోకి చేర్చుకునే విధంగా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఏలూరు కార్పొరేషన్‌లో పాఠశాలల్లో వెనక్కి తీసుకున్న నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను తిరిగి పాఠశాలల్లో నియమించాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా తాగేందుకు వీలుగా తాగునీరు లేదని, గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పిన వాటర్‌గ్రిడ్ పథకం ఏమైందని ప్రశ్నించారు. మండలానికి ఒక జూనియర్ కాలేజీ అంటూ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన ఇంటర్ విద్య పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని, దీనిపై స్పష్టత ఇవ్వాలలని కోరారు.

ఎన్నికల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - ఏలూరు

సుమోటోగా ఓటర్లను తొలగించరాదని, నోటీసిచ్చిన తర్వాతే సరిచూసుకుని మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆయన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ ఎవిఎస్ఎస్.మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ బిఎల్ఒ రిజిస్టర్ నిర్వహణ ఉండాలని, ఈ నెలాఖరులోపు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇఆర్ఒ నెట్ 2.0 ఈ నెల 17 నుండి అందుబాటులోకి రానుందన్నారు. పెండింగ్ క్లెయిమ్స్, అబ్జెక్షన్స్‌పై దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం నియోజకవర్గాల సహా ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఇవిఎంలు, వివి ప్యాట్ వాటి సంబంధిత పరికరాలను భద్రపర్చేందుకు గొడౌన్లు పూర్తిస్థాయిలో భద్రత ప్రమాణాలు మేరకు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను భౌతికంగా తనిఖీ చేయాలని ఆర్‌డిఒలను ఆదేశించారు. బిఎల్ఒలు రిజిస్టర్లు నిర్వహణ, సమగ్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సహా ఎన్నికల అధికారులు జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒలు కె.పెంచల్‌కిషోర్, ఝాన్సీరాణి సంబంధిత ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడిలో అంబేద్కర్ జయంతి

జిల్లాస్థాయి కార్యక్రమానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి మహోత్సవాన్ని శుక్రవారం చింతలపూడిలో నిర్వహించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు తెలిపారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 9.30 గంటలకు చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాలంకరణ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం మెయిన్ రోడ్డులోని శ్రీశ్రీ కన్వెన్షన్ హాలులో ఉదయం 10.30 గంటలకు చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అధ్యక్షతన అంబేద్కర్ 132వ జయంతి సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, వివిధ దళిత సంక్షేమ సంఘం నాయకులు, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.



పాఠశాల విద్యార్థులతో నాగేంద్రప్రసాద్

కష్టం ఫలించింది.. కల నెరవేరింది

24 ఏళ్ల తర్వాత డిఎస్‌సి అభ్యర్థికి పోస్టింగ్

ప్రజాశక్తి - పోలవరం

జీవితానికో భరోసా, ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న కల నెరవేరిన వేళ.. వచ్చే సంతోషం ఎలా ఉంటుందో చెప్పలేం.. అలాంటి ఘటనే డిఎస్‌సి 1998 క్వాలిఫైడ్ అభ్యర్థిలో కనిపించింది. 24 ఏళ్ల తర్వాత పాఠశాలలో పోస్టింగ్ రావడంతో అతని ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వివరాలిలా ఉన్నాయి. డిఎస్‌సి 1998 క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో కొణతాల నాగేంద్రప్రసాద్ ఒకరు.. 24 సంవత్సరాల నిరీక్షణ తర్వాత ఉపాధ్యాయ పోస్టింగ్‌కు ఆయన ఎంపికయ్యారు. మండలంలోని రేపల్లివాడ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధించే అవకాశం దక్కింది. గురువారం ఉదయం ఆయన పాఠశాలకు వెళ్లి పాఠాలు చెప్పారు. దీంతో నాగేంద్రప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 24 సంవత్సరాల నిరీక్షణ తర్వాత తమ కల నెరవేరిందని, మొదటి రోజు పాఠశాలకు వెళుతుంటే తన ఒళ్లు పులకించిందని ఆ అనుభూతి మాటల్లో వర్ణించలేనిదని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సాయశక్తులా కృషి చేస్తానన్నారు. డిఎస్‌సి 1998 ఉపాధ్యాయులుగా ఎంపికై తమతోపాటు పాఠశాలలో చేరిన తోటి ఉపాధ్యాయులకు కొణతాల నాగేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థుల కోసం నిరంతరం కృషిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

పోలవరం:ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్ఎన్‌డి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మసూద్ బిన్ ఖలీల్ సూచించారు. గురువారం కల్లుమామిడి, చింతపల్లిలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జ్వరంగానీ, ఇతరత్ర ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే వైద్యశాలకు రావాలని సూచించారు. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. మెడికల్ క్యాంప్ వద్ద జనరల్ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ ప్రసాద్, పిహెచ్ఎన్‌పి.లక్ష్మీదేవి, ఎంపిహెచ్ఎస్(ఎఫ్) శైలజ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

సిపిఎం, సిపిఐ ప్రచారభేరి జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతలపూడి

బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఈనెల 14వ తేదీ నుండి 30 వరకూ జరిగే సిపిఎం, సిపిఐ చేపడుతున్న ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్‌విఎస్.సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. చింతలపూడి పట్టణంలో గురువారం సిపిఐ కార్యాలయంలో ప్రచార భేరి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో మోడీని గద్దె దింపండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈ నెల 14వ తేదీ వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. బిజెపి మతోన్మాద కార్పొరేట్ అనుకూల ప్రయివేటీకరణ, విధానాలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని ఈ ప్రచార భేరి సాగుతుందని తెలిపారు.

సిపిఐ మండల సహాయ కార్యదర్శి కొర్లపాటి బాబు మాట్లాడుతూ 14వ తేదీన ప్రచారభేరి ప్రారంభిస్తామని 17, 18 తేదీల్లో చింతలపూడి పట్టణంలో, 21న టి.నరసాపురం మండలంలో, 22న చింతలపూడి మండలంలో, 23న లింగపాలెం మండలంలో యాత్ర సాగుతుందని తెలిపారు. అనంతరం చింతలపూడి పట్టణంలో బహిరంగ సభ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం నాయకులు ఎస్.సూర్యకుమార్, సత్యనారాయణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్లూరు సోమశేఖర్, మండల కమిటీ సభ్యులు దంతా కృష్ణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య పాల్గొన్నారు.

దశరత్నంగా భూపంపిణీ చేపట్టాలి

ఆగిరిపల్లి:కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేసి నవరత్నాల కార్యక్రమంలో దశరత్నంగా భూ పంపిణీ కార్యక్రమం చేపట్టి వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆగిరిపల్లిలోని సుందరయ్య నిలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘ భూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు భూమి ఎంతో కీలకమైదని, పలురకాలైన మిగులు భూములను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని, కూలీలకు రోజుకి రూ.600 కూలి ఇవ్వాలని, జగనన్న ఇళ్ల కాలనీల లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను అమర్చొద్దని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి ఈపూరి రవీంద్ర, నాయకులు సత్తు కోటేశ్వరరావు, శివనాగరాజు, షేక్ జహంగీర్‌బాషా, బండి కోటేశ్వరరావు, బాయమ్మ, బాబూరావు, చిన్న నాగేశ్వరరావు, స్టాలిన్, పలువురు వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

గ్రూపుల పోరుకు బాబు స్వస్తి పలికేనా..!

నూజివీడు ఎంఎల్‌ఎ టిక్కెట్ రేసులో ముగ్గురు

ఎవరికి వారే.. యమునా తీరుగా నాయకులు, కార్యకర్తలు

నేడు నూజివీడుకు చంద్రబాబు రాక

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ

పటిష్ట ఏర్పాట్లు చేసిన పార్టీ నేతలు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు నియోజకవర్గ టిడిపిలో నెలకొన్న గ్రూపు విబేధాలకు పార్టీ అధినేత చెక్‌పెడతారా? ఎంఎల్‌ఎ అభ్యర్థి ఎంపికలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తారా? ఇక్కడ టిక్కెట్ ఆశిస్తున్న ముగ్గురినీ ఆయన ఎలా సముదాయిస్తారు? ఇవి.. టిడిపి అధినేత చంద్రబాబు ఈనెల 14న నూజివీడు వస్తున్న సందర్భంగా నియోజకవర్గ ప్రజల్లోనూ, నాయకుల్లోనూ నెలకొన్న ప్రశ్నలు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఎన్‌టిఆర్ స్వగ్రామం నిమ్మకూరులో ఈ నెల 12న ప్రారంభమైన రోడ్‌షో 13వ తేదీ గుడివాడ నియోజకవర్గ పర్యటన అనంతరం 14వ తేదీ శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు నూజివీడు నియోజకవర్గం మర్రిబంధం గ్రామానికి రానున్నారు. అక్కడి నుండి భారీ ర్యాలీగా నూజివీడు చేరుకుని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుండి చైతన్య రథం వాహనంపై రోడ్డు షో నిర్వహిస్తారు. అనంతరం స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని టిడిపి నేతలు తెలిపారు.

టిక్కెట్ రేసులో ముగ్గురు

నియోజకవర్గంలో టిడిపి తరపున పోటీ చేసేందుకు ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావుతో పాటు ముసునూరు మండలం గోగులంపాడుకు చెందిన మరో అభ్యర్థి పర్వతనేని గంగాధరరావు కూడా టిడిపి టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారు. ఆరు నెలలుగా ఆయన కూడా నియోజకవర్గంలో వ్యక్తిగతంగా పట్టు పెంచుకునేందుకు తమదైన శైలిలో ముందుకు వెళుతున్నారు. అలాగే నూజివీడు ఎఎంసి మాజీ అధ్యక్షులు, ప్రస్తుత కొత్త రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు కూడా టికెట్ రేసులో ఉన్నారు. నియోజకవర్గంలో కాపాకు మంచిపట్టున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో బిసి సామాజిక తరగతికి చెందిన జనాభా ఎక్కువ. ఈ నేపథ్యంలో బిసి అభ్యర్థికి టిక్కెట్ ఇస్తే ఓట్లు రాబట్టొచ్చనే ఆలోచనతో 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో బిసి అభ్యర్థి ముద్రబోయినకు టిక్కెట్ ఇచ్చారు. కానీ నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపుల పోరు అధికంగా ఉండటంతో వైసిపి అభ్యర్థి మేక వెంకట ప్రతాప్ అప్పారావు సునాయాసంగా రెండు పర్యాయాలు విజయం సాధించారు. ముద్రబోయిన వెన్నంటే ఉండే కొంతమంది నాయకులు ఎన్నికల సమయంలో ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు గతంలో తేటతెల్లమైంది. దీనిపై ఆయన పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో కొంతమంది నాయకులపై కూడా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ నియోజకవర్గంలో గ్రూపుల పోరు నివురుగప్పిన నిప్పులా ఉంది. పైకి పార్టీ కార్యక్రమాల్లో కలిసి చేస్తున్నప్పటికీ మరికొన్ని సందర్భాల్లో ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరిస్తున్నారు. ముద్రబోయన పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్నప్పటికీ ఆయనతో సంబంధం లేకుండా కొంతమంది నాయకులు నారా లోకేష్ ఆశీస్సులు తమకే ఉన్నాయని, నూజివీడు సీటు ముద్రబోయినకు రాదని, తాము సూచించిన వారికే వస్తుందని పలువురు ప్రచారం నిర్వహిస్తున్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి జరిగిన ఎన్నికల్లో ఎక్కువ పర్యాయాలు టిడిపి అభ్యర్థులే విజయం సాధించారు. పార్టీ తరపున మాజీ ఎంఎల్‌ఎ కోటగిరి హనుమంతరావు 25 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. ఆ తర్వాత వచ్చిన డాక్టర్ చిన్నం రామకోటయ్య ఎన్నికలకు పది రోజుల ముందు టిడిపి టికెట్ తెచ్చుకుని సునాయాసంగా విజయం సాధించారు. ముద్రబోయిన వచ్చినప్పటి నుంచి జరిగిన ఎన్నికల్లో తెలుగు తమ్ముళ్లు ఐక్యంగా లేకపోవడంతో టిడిపికి కంచుకోటగా ఉన్న ఇక్కడ విజయం నల్లేరు మీద నడకగా సాగుతుంది.

నియోజకవర్గంలో నాయకులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు చంద్రబాబు విశేష కృషిచేస్తున్నట్లు తెలుస్తుంది. పార్టీలో అంతర్గత విబేధాలు, కుమ్ములాటలు లేకుండా అందరూ ముద్రబోయిన ఆధ్వర్యంలో కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఈ నెల పదో తేదీన నూజివీడు వచ్చిన సందర్భంగా పర్వతనేని గంగాధరరావుకు, ముద్రబోయిన వెంకటేశ్వరరావుకు సూచించారు. వారిద్దరూ పార్టీ విజయానికి కృషి చేస్తామని ఆ సమయంలో హామీ ఇచ్చారు. ముద్రబోయిన వెంకటేశ్వరరావు గత కొన్నేళ్లుగా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నాయకులకు, కార్యకర్తలకు నిరుత్సాహం లేకుండా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాలు, నిరసనలు వంటి కార్యక్రమాల్లో ముద్రబోయిన ముందుండి నడిపించేవారు. టిడిపిలో గ్రూపు విబేధాలు సమసిపోయి కలిసికట్టుగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని పార్టీ నేతలు, కార్యకర్తలు భావిస్తున్నారు.

శరవేగంగా జరుగుతున్న సిసి రోడ్డు పనులు

శరవేగంగా సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో సిసి రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎంతోకాలంగా ఈరోడ్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు రాకపోకల సాగించేందుకు నానా ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యలను గుర్తించిన గ్రామ సర్పంచి నిమ్మగడ్డ క్రిక్కమ్మ పంచాయతీలో తీర్మానం చేసి గ్రామంలోని సిసి రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రారంభించారు. అంబేద్కర్‌నగర్‌లో రెండు సిసి రోడ్లు, కల్వర్టుల రూ.2 లక్షలు, పామర్రి గిరిరాజులు ఇంటి వద్ద జిఎస్‌పి రోడ్డు నిర్మాణానికి రూ.మూడు లక్షలు, ముదినేపల్లి, అన్నవరం గ్రామాల్లో డ్రైనేజీలపై ఐదు చోట్ల కల్వర్టుల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు అంచనాతో పనులు జరుగుతున్నాయి. మొత్తం రూ.14 లక్షల పంచాయతీ ఆర్థిక సంఘం నిధులతో ముదినేపల్లిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను గురువారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ క్రిక్కమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శిసభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, పంచాయతీ కార్యదర్శి టివి.సారధి పర్యటించి పనులను పరిశీలించారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

తహశీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం

ప్రజాశక్తి - పోలవరం

తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాసరాజులు పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ శ్రీనివాసబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్, ఎంపిడిఒ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు, భూ రీ సర్వే తహశీల్దార్ కాజా రమేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది, వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, ప్రజలు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహశీల్దార్

పట్టణంలో పలుచోట్ల చలివేంద్రాలు

జంగారెడ్డిగూడెం:వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో చలి వేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ కె.స్లీప జోజి తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద చలి వేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చలి వేంద్రాలు ఉపయోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు ప్రజల అవసరాల మేరకు చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు వరలక్ష్మి, రమేష్, వీఆర్ఓ బాజీ పాల్గొన్నారు.

వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి - మండవల్లి

అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయొద్దని ఐబికర్ స్పెషాలిటీ వైద్యశాల న్యూరో సర్జన్ డాక్టర్ ఇడుపులపాటి రాజ్యలక్ష్మి తెలిపారు. మండవల్లి ప్రధాన సెంటర్‌లో ఉన్న శ్రీ సాయి ప్రేమ్ ఎంబిబిఎస్ సెంటర్‌లో గురువారం ఐబికర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజలక్ష్మి స్వయంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. గుడివాడలోని ఐబికర్ ఎడురుగా ఉన్న ఐబికర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో అధునాతన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు గణేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గాయపడిన విద్యార్థి

బస్సు నుంచి జారి విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి

బస్సు నుంచి విద్యార్థి జారిపడి గాయాల పాలైన ఘటన జాతీయ రహదారిపై మండవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం పెరికేగూడెం గ్రామానికి చెందిన ఆర్.సౌమ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలను రాస్తుంది. గురువారం సైన్స్ పరీక్ష రాసిన అనంతరం స్వగ్రామానికి వెళ్లేందుకు ప్రయివేటు బస్సు ఎక్కబోయింది. ఈ తరుణంలో డ్రైవర్ బస్సును ముందుకు కదల్చడంతో జారి బస్సు కిందకు వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను బయటకు లాగేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అప్పటికే బస్సు టైరు కాలు కొద్దిగాను మీదకు ఎక్కింది. దీంతో కాలుకు ఒకవైపు చర్మం పూర్తిగా ఊడిపోయింది. తీవ్రరక్తం స్రావం కావడంతో వెంటనే ఆమెను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోలీసులు సామరస్యంగా వ్యవహరించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - భీమడోలు

జాతీయ రహదారిపై కొమిరేపల్లి వద్ద బుధవారం నిర్మించిన రాస్తారోకో సందర్భంలో సమస్య పరిష్కారానికి పోలీసులు మరింత సామరస్యంగా వ్యవహరించి ఉంటే బాగుండేదని కెవిపిఎస్ మండల శాఖ అభిప్రాయపడింది. కెవిపిఎస్ మండల శాఖ సమావేశం గురువారం మండల కన్వీనర్ టి.సుమన్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమిరేపల్లి గ్రామానికి చెందిన కడిమే సతీష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరులో చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడని తెలిపారు. దీనికి ప్రధాన కారణం ఆ ప్రాంతంలో జాతీయ రహదారి కింద అండర్ పాస్ రోడ్డు లేకపోవటమే కారణమన్నారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, పలువురు చనిపోతున్నారని పేర్కొన్నారు. ఇదే క్రమంలో సతీష్ కూడా చనిపోయాడని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొమిరేపల్లి గ్రామస్తులతో పాటు ఇదే గ్రామానికి చెందిన దళితులు కడిమే సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలని, అండర్ పాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పాటు, ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు లాఠీచార్జి చేసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారన్నారు. దీనిపై పోలీసులు మరింత సామరస్యంగా వ్యవహరించవలసి ఉండేదని ఆయన అన్నారు. గ్రామస్తులు ,దళితుల డిమాండ్ మేరకు ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలను తప్పించేందుకు జాతీయ రహదారి కింద అండర్ పాస్ రోడ్డు ఏర్పాటు, చనిపోయిన కడిమే సతీష్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఆయన కోరారు.

నేటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఈనెల 14వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.మల్లీశ్వరి గురువారం తెలిపారు. 14న అల్లూరు, ముసుపాపడు, చిగురుకోట, చిసపాలపర్రు, దాకరం, ముదినేపల్లి, పెయ్యేరు, పెదపాలపర్రు గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. 15న చినకామనపూడి, దేవపూడి, కోడూరు, కొమర్రు, కొరగుంటపాలెం, ములకలపల్లి, పేదూరు గ్రామాల్లో, 17న చేవూరు, ఈడేపల్లి, గురజ, కాకరవాడ, పెదకామనపూడి, ప్రొద్దువాకలో, 18న పెదగొన్నూరు, పెనుమల్లి, శింగరాయపాలెం, శ్రీహరిపురం, వడాలి, వాడపల్లిలో 19న సంకర్షణపురం, ఉటుకూరు, వి.రావిగుంట, వైవాకలో, 20న వణుదుర్రులోగ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో సభలు జరుగుతాయన్నారు.

పది పరీక్షలకు పలువురు గైర్హాజరు

ప్రజాశక్తి - కలిదిండి

గురువారం జరిగిన పదో తరగతి జనరల్ సైన్స్ పరీక్షకు 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ కొల్లాటి నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 211 మంది విద్యార్థులకు నలుగురు, కొరుకొల్లులో 304 మందికి ముగ్గురు, కలిదిండి హైస్కూల్ ఎ కేంద్రంలో 215కు ఆరుగురు, బి కేంద్రంలో 196కు ఇద్దరు, భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 143 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు. మొత్తం 1069 మంది విద్యార్థుల పరీక్ష రాయాల్సి ఉండగా 1052 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు నరేష్ కుమార్ తెలిపారు.

చంద్రబాబు రోడ్‌షోకు తరలిన నేతలు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక నాని పెట్రోల్ బంక్ నుండి గుడివాడలో జరిగే చంద్రబాబు రోడ్‌షోకు మండలం నుండి టిడిపి నేతలు బైక్‌ర్యాలీగా తరలివెళ్లారు. సుమారు 500 మంది ర్యాలీలో పాల్గొన్నారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగరాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సున్నా రమాదేవి, ఎంఎంపి మాజీ వైస్ ప్రెసిడెంట్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ లంకా రత్నారావు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాసరావు, వెంకటాపురం, ఎస్‌ఆర్‌పి అగ్రహారం సర్పంచులు గుడివల్లి శ్రీనివాసరావు, పరసా వెంకట స్వామి, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కురేళ్ల ఏడుకొండలు, జంకి అబుసీలరావు, సారిక వెంకటేశ్వరరావు, బొర్ల ఏడుకొండలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణ, మండల పరిధిలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షల్లో 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 1767 మందికి గాను 1743 మంది హాజరయ్యారు.



సాయం చేస్తున్న గోపాలకృష్ణ

వ్యాధిగ్రస్తునికి మాజీ సర్పంచి సాయం

ప్రజాశక్తి - ముసునూరు

ఆపదలో ఉన్నవారికి ప్రతిఒక్కరూ అండగా ఉండాలని ముసునూరు మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ అన్నారు. గురువారం ముసునూరుకు చెందిన చెట్టుమాల శాంతిబాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనిపై స్పందించిన గోపాలకృష్ణ ఆతనికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలు అందచేశారు.

20 నుంచి జగనన్న విద్యాకానుక పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

జగనన్న విద్యా కానుక-4 మండల స్థాయి పంపిణీ కార్యక్రమం ఈనెల 20వ తేదీ నుంచి వచ్చేనెల 30వ తేదీ వరకూ దశలవారీగా కొనసాగుతుందని జగనన్న విద్యాకానుక రాష్ట్ర పరిశీలకులు, టెక్స్ బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రనాధ్‌రెడ్డి తెలిపారు. ఆయన జగనన్న విద్యా కానుక సిఎంఒ జె.రవీంద్రతో కలిసి ఎంఇఒ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ డి.సాంబశివరావుతో పంపిణీ జరగనున్న జగనన్న విద్యా కానుకల స్టాక్‌పాయింట్, భద్రత, పంపిణీ అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టు, షూలు, ఏకరూప దుస్తులతో పాటు నిఘంటువులను అందజేయనున్నామన్నారు. వీటన్నింటినీ పాఠశాలల పున:ప్రారంభానికి ముందే పాఠశాలల వద్ద ఆ యాజమాన్యాలకు అందజేస్తారన్నారు. ఆ తరువాత విద్యార్థులకు పంపిణీ కార్యక్రమాలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు ఎంఇఒ, వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఆధ్వర్యంలో రెండు వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యా కానుకలను మండల స్టాక్ పాయింట్‌ల వద్ద స్వీకరించడం, తిరిగి వాటిని వాటిని పాఠశాలల వారీగా పంపే బాధ్యతలను స్వీకరిస్తారన్నారు. ఆదేవిధంగా వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఆధ్వర్యంలోని కమిటీ జగనన్న విద్యా కానుక నాణ్యత పరిశీలనతోపాటు, పంపిణీ జరిగేంత వరకూ వాటిని భద్రపరిచే కార్యక్రమాలను పరిశీలిస్తుందని తెలిపారు. భీమడోలు హైస్కూల్లో మండల స్థాయి స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిలు సత్యప్రసాద్, రమణ, రాధాకృష్ణ, కార్యాలయ సిబ్బంది సుమలత పాల్గొన్నారు.

పలుచోట్ల జగనన్నే 'మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నాల్గో వార్డు ఇంద్ర నగర్ కాలనీ కొత్తపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వార్డు ఇన్‌ఛార్జి చిప్పాడ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు సచివాలయ కన్వీనర్ పి.సరస్వతి హాజరై పాల్గొన్నారు. ఈ క్రమంలో గృహ సారధులు చిప్పాడ కుమారి, కె.ఎండు, సుంకర లక్ష్మి, మాచవరపు నాగేంద్ర, చల్లపల్లి కనకదుర్గ, వాలంటీర్లు ప్రతీఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలన్ని వివరించారు. అలాగే స్థానిక ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..

మండవల్లి:రాష్ట్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పులపర్రు, చింతపాడు, మణుగూరు గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణతో కలిసి గురువారం పాల్గొన్నారు. గృహ సారధులతో కలిసి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అనంతరం స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామచంద్రప్రసాద్, కైకలూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ మధు శివరామకృష్ణ, సచివాలయాల కన్వీనర్లు చంద్రాల సూర్యనారాయణ, అంబటి సుబ్రహ్మణ్యం, నీలం సిద్ధయ్య, సర్పంచులు నాగరాజు, మొకరాలి తులసీరత్నం, ఎంపిటిసి దారం రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు పుల హరిబాబు, బొమ్మనబోయిన గోవర్ధనయాదవ్, జిల్లా వైసిపి సేవాదళ్ అధ్యక్షులు భలే నాగరాజు, మాజీ ఎంపిపి ముంగర గోపాలకృష్ణ, సయ్యపరాజు గుర్రాజు, జానకి రామయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.



మండవల్లిలో..

ముసునూరు:జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముసునూరు హరిజనవాడలో గ్రామ మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, గృహసారధులు, వాలంటీర్లు, కన్వీనర్లు, వార్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్టిక్కర్లు అంటించారు.

'పోలవరం' ఎత్తు తగ్గించొద్దు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు ఎత్తు, డిజైన్ ప్రకారం మాత్రమే నిర్మించాలని, తగ్గించే ప్రయత్నాలు చేయొద్దని సిపిఐఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌ఎస్‌పిఎల్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని గతంలో ఏనిమిది రోజులపాటు కలెక్టర్ ఆఫీస్ వరకూ పాదయాత్ర నిర్వహించామన్నారు. 2005 నుండి ఎంతమంది ముఖ్యమంత్రులు వచ్చినా పోలవరం ప్రాజెక్టు సత్వరం పూర్తి చేస్తామని, నిర్వాసితులకు న్యాయం చేస్తామని, పునరావాసాలు పూర్తిస్థాయిలో కల్పిస్తామని చెప్పారని, కానీ ఆచరణలో లేదన్నారు. సిపిఐ ఎంఎల్ పరిశీలనలో ఆనాటి నుండి నేటి వరకూ పునరావాసాలు, పరిహారాలు భూమికి భూమి, ఆర్‌అండ్ఆర్ పరిహారాలు పూర్తి స్థాయిలో జరగలేదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన నడుస్తుందన్నారు. 45.72 మీటర్ల ఎత్తులో నిర్మిస్తేనే గ్రావిటీ ద్వారా నీరంది అవకాశాలున్నాయని, 80 టిఎంసిల నీరు కృష్ణా, గోదావరి డెల్టాలకు తీసుకువెళ్లే అవకాశాలుంటా యన్నారు. కర్నాటక ఆల్మట్టి డ్యాం నిర్మాణం తర్వాత కృష్ణ డెల్టా ఎండిపోయిందని, ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా 80 టిఎంసిల నీరు తీసుకువెళ్తే కృష్ణ డెల్టా సస్యశ్యామల మవుతుందని పేర్కొన్నారు. శ్రీశైలం ద్వారా రాయలసీమ రైతులు కూడా నీటిని వాడుకునే అవకాశాలున్నాయని, ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటిని విశాఖపట్నం వరకూ అందించవచ్చన్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టు ఒక వరమన్నారు. టిడిపి ఎంపీ కనకమేడల ఆడిగినప్పుడు ఎత్తు తగ్గిస్తున్నామని ప్రభుత్వాలు చెప్పాయని, 41.15 మేరకు ఎత్తు తగ్గిస్తే ఇది బ్యారేజ్ అవుతుందని కానీ ప్రాజెక్టు కాదని వివరించారు. 41.15 మేరకు ఎత్తు తగ్గిస్తే 35 వేల కోట్ల రూపాయలు పునరావాసాలకు, పరిహారాలకు పెట్టే ఖర్చు ఆదా అవుతుందని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం నిలదీసే పరిస్థితులు లేవన్నారు. ఎత్తు తగ్గింపు చూసిన చేస్తే, 196 టిఎంసిల నీరు నిల్వ ఉండేదా నిర్మాణం చేపట్టాలని కోరారు. రెండు లక్షల మంది నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారాలు కూడా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.ఎల్ మండల కార్యదర్శి వెంకటనరసింహారావు, రమేష్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

స్థానిక యుటిఎఫ్ భవనంలో గురువారం సాయంత్రం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ దీనజనోద్ధరకుడు అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవానందరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, జయరాజు, ఎంసిగూడెం హై స్కూల్ హెచ్ఎం లీల కుమార్, రాంబాబు, శ్రీనివాస్, మోహన్‌రావు, బెనర్జీ కె.చిన్నబాబు, కాళీ, శ్రీను ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

నేడు అంబేద్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - మండవల్లి

ఈనెల 14న అంబేద్కర్ జయంతి వేడుకలను మండవల్లిలో ఘనంగా నిర్వహిస్తున్నామని జయంతి ఉత్సవ కమిటీ మండల అధ్యక్షులు ఎల్‌.ఎస్.భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల నివాళులర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆపదమిత్రలకు ప్రత్యేక కిట్లు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని 17 మంది ఆపద మిత్రులకు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రత్యేక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్పందించి వారిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుందరి, ఎపిఎం దయాల రాజశేఖర్, డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కిట్లు అందిస్తున్న ఎంఎల్‌ఎ వెంకటప్రతాప్

నోటీసు

మహారాజశ్రీ రామచంద్రపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
E.A. 48/2022; E.A. 49/2022; E.P. 117/2022; O.S. 75/2021

Between:
కాదా నాగేంద్రబాబు ...DHr
మరియు
పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు (Died) వగైరాలు ...JDrs

To,
R2 : పెద్దిరెడ్డి వర్మాలక్ష్మి, W/o. (లేటు) పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు, హిందూ, వయస్సు 48 సం॥లు, డో.నెం. C3-71, Y.S.R. నగర్, రామలక్ష్మి బ్రిక్స్ కంపెనీ దగ్గర, పెదపేట (గ్రామం మరియు మండలం), ఏలూరు జిల్లా, ఏలూరు JCJC.

R3 : పెద్దిరెడ్డి రాజ్యలక్ష్మి, D/o. (లేటు) పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు, హిందూ, వయస్సు 30 సం॥లు, డో.నెం. C3-71, Y.S.R. నగర్, రామలక్ష్మి బ్రిక్స్ కంపెనీ దగ్గర, పెదపేట (గ్రామం మరియు మండలం), ఏలూరు జిల్లా, ఏలూరు JCJC.

R4 : పెద్దిరెడ్డి దీపిక, D/o. (లేటు) పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు, హిందూ, వయస్సు 26 సం॥లు, డో.నెం. C3-71, Y.S.R. నగర్, రామలక్ష్మి బ్రిక్స్ కంపెనీ దగ్గర, పెదపేట (గ్రామం మరియు మండలం), ఏలూరు జిల్లా, ఏలూరు JCJC.

పై రెంటవరు E.P. No. 117/2022 in O.S. No. 75/2021 గ్రంధములో మరియు సదరు E.P.లో పెండింగులో వున్న E.A. No. 48/2022 మరియు E.A. No. 49/2022 పిటీషన్లులో పై రెస్పాండెంట్లు శ్రీ కోర్టువారు వచ్చిన నోటీసులు జారీ చేసినను ... డిక్రీదారుడు ... చేయటం ... 24-04-2023 తేదీన ఉదయం 10-30 గం॥లకు ... E.P. No. 117/2022 in O.S. No. 75/2021 ... E.A. No. 48/2022, E.A. No. 49/2022 ...

(శ్రీ కోర్టువారి ఆనుమతితో)
బి. తాతకేశ్వరరావు
అడ్వకేట్, రామచంద్రపురం.
రామచంద్రపురం, ది.12-4-2023 సెల్: 88979 31119

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

నూజివీడు రూరల్:మండలంలోని తుక్కులూరులో ఐసిడిఎస్ సిబ్బంది నిర్వహించిన సర్వేలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న నిరుపేద గర్భిణులకు పోషకాహారం అందజేశారు. అలాగే ఇటుక బట్టి యజమాని వల్లభనేని రామకృష్ణతో మాట్లాడి బట్టీలలో పనిచేస్తున్న గర్భిణులకు, ప్రతిరోజు కొవ్వుట్ జ్యూస్, బీట్‌రూట్, రాగిపిండి, పాలు, అరటి పండ్లు అందజేశారు.

CHANGE OF NAME

I, MELVIN JOE NARAYANA, S/o Mekala Lakshmi Narayana have changed my name from MELVIN JOE NARAYANA to MEKALA MELVIN JOE NARAYANA residing at 2/139 SDA Colony Pakka Banglow Road, Near Giffard Memorial Hospital, Nuzvid, vide affidavit dated 15/07/2022 Sworn before Notary Pamarthi Nagaraju Gollapalli, Nuzvid, Andhra Pradesh.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P. No. 17/2022

పిటిషనర్: ముదునూరి లక్ష్మీ గణపతి వర్మ
Vs
రెస్పాండెంట్: చేకూరి సతీష్ వర్మ మరియు 2 ఆదర్స్

పై నెంబరు క్రెడిటర్ ఐ.పి.లో మొదటి రెస్పాండెంట్ అయిన చేకూరి సతీష్ వర్మ, తండ్రి: లక్ష్మీపతిరాజు, డోర్ నెంబరు 19-18-/3, కేటరి నగర్, భీమవరం, భీమవరం మండలం అను వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిన తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు అనే కారణముగా ఈ కోర్టు వారు ది. 28-03-023 సంబు తేదీన ప్రజాశక్తి పేపరులో పబ్లికేషన్ ద్వారా మొదటి రెస్పాండెంట్‌కు నోటీసు అమలు చేయుటకు ఆదేశించడము అయినది.

కనుక ఈ కేసులో మొదటి రెస్పాండెంట్ అయిన చేకూరి సతీష్ వర్మ ది. 27-04-2023 సం॥రం తేదీన స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10.30 నిలకు కోర్టుకు హాజరు అయ్యి సదరు కేసులో ఆక్షేపణలు ఉన్న భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టుకి వచ్చి విన్నవించుకోవలని యుంది మూలముగా తెలియజేయటము జరిగినది.

సి.జ్వాలా శ్రీనివాస్
పిటిషనర్ తరపు న్యాయవాది
భీమవరం 12-04-2023 భీమవరం, సెల్:9393939374

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు వారి కోర్టులో
ఓ.యస్. నెం. 698/2022

బిట్వీన్:
కొవ్వూరి శ్రీ లక్ష్మి -వాది
మరియు
కర్రి శ్రీరామకృష్ణారెడ్డి, తండ్రి: లేటు వెంకటరెడ్డి, డోర్ నెం. 3-93, సత్యావాడేశ్వరం - 534 123, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిధి -ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావా, వాది మీ నుంచి రూ. 6,96,547/-లు ఆరు ప్రామిసరీ నోట్ల బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా మీరు దావా సమన్లు అందుకొననందున, శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ ఆర్డరు చేసినారు. కావున మీరు ది. 02-05-2023 ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు ఎదుట హాజరు అవ్వని ఎడల మీ పరోక్షము నందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.31-03-2023 సెల్: 9390018122

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో
ఓ.యస్. నెం. 661/2022

బిట్వీన్:
పెన్మత్స వెంకట రామరాజు -వాది
మరియు
సలాది మురళీకృష్ణ -ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

ప్రతివాది: సలాది మురళీకృష్ణ, తండ్రి: లేటు అవతారం, వాటర్ సప్లయ్ ట్యాంక్ వద్ద, మొఖాసా కల్వపూడి - 521345, మండవల్లి మండలం, లోగడ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా, ప్రాంసరీ నోటు బాకీ రూ. 2,85,356/-లు వసూలు నిమిత్తం మీ పై దాఖలు చేయగా, దావా సమన్లు అందుకొనక మీరు కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా సమన్లు ఆర్డరు చేసినారు. కావున మీరు ది. 26-04-20223 తేదీన ఉదయం 10.30 గం॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల మీ పరోక్షము నందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.31-03-2023 సెల్: 9390018122

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు వారి కోర్టులో
ఐ.ఏ. నెం. 699/2022 ఇన్
ఓ.యస్. నెం. 698/2022

బిట్వీన్:
కొవ్వూరి శ్రీ లక్ష్మి -పిటీషనర్/వాది
మరియు
కర్రి శ్రీరామకృష్ణారెడ్డి, తండ్రి: లేటు వెంకటరెడ్డి, డోర్ నెం. 3-93, సత్యావాడేశ్వరం - 534 123, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిధి -రెస్పాండెంట్/ప్రతివాది

పిటిషనర్/వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు పిటిషన్ మీ సత్యావాడేశ్వరం, ఆర్.ఎస్. నెం. 141/1 నందు ఎ.0-52 సెంట్ల భూమి అందులో కోళ్ళఫారం షెడ్లతో సహ జడ్జిమెంట్ ముందే కోర్టుకు జత చేయాలని పై నోటీసులు అందుకొననందున, శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ ఆర్డరు చేసినారు. కావున మీరు ది. 02-05-2023 ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు ఎదుట హాజరు అవ్వని ఎడల మీ పరోక్షము నందు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.31-03-2023 సెల్: 9390018122